# తీర్పు వాయిద

Registered No : APTEL/25/A1897

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.... జాతీయ తెలుగు దిన పత్రిక

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ గురువారం 14-05-2026 సంపుటి : 1 సంచిక :283 ఎడిటర్ : యం నాగేశ్వరరావు పేజీలు : 4 వెల రు : 2/-


## ధాన్యం సేకరణ వేగంగా పూర్తిచేయాలి



- నిర్లక్ష్యంగా ఉంటే కలెక్టర్లపైనా చర్యలు
- గోడౌన్ల సమస్య ఉన్నచోట తాత్కాలిక ఏర్పాట్లు చేయండి
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి
- కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు
- అకాలవర్షాల నష్టాన్ని తగ్గించాలి
- ధాన్యం లోడ్ చేయగానే రసీదు ఇవ్వాలి - ఎలాంటి సహకారానికైనా సిద్ధంగా ప్రభుత్వం: మంత్రి ఉత్తమ్
- సరిహద్దు రాష్ట్రాల నుంచి ధాన్యం: మంత్రి తుమ్మల - 'బాయిల్డ్' కోటా పెంపుపై పోరాడి సాధించిన రాష్ట్రం

## పీఎం కాన్వాయ్ సగానికి తగ్గింపు..

### మోదీ పొదుపు మంత్రం..!




పశ్చిమాసియాలో సంక్షోభం నేపథ్యంలో దేశ ప్రజలకు పొదుపు మంత్రం పాటించాలని సూచించిన ప్రధాని మోదీ.. స్వయంగా వాటిని పాటించేందుకు సిద్ధమయ్యారు. తన అధికారిక కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను 50 శాతం తగ్గించాలని మోదీ ఆదేశించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు మీడియాలో కథనాలు వస్తున్నాయి.

## అమరావతే కాదు..

భవిష్యత్తులో ప్రభుత్వంలోనూ వర్క్‌ఫ్రమ్ హోమ్

## విశాఖనూ విశ్వనగరం చేస్తున్నాం

అభివృద్ధి విషయంలో ఒక్క అమరావతిపైనే శ్రద్ధ పెట్టట్లేదని.. విశాఖనూ విశ్వనగరంగా చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రాజధాని ప్రాంతంలో కిమ్స్ ఆసుపత్రి, వైద్య విశ్వవిద్యాలయం నిర్మాణానికి బుధవారం సీఎం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు.



"రాయలసీమను రతనాల సీమగా మారుస్తున్నాం. ఆ ప్రాంతానికి అనేక పరిశ్రమలు వస్తున్నాయి. ఏరో స్పేస్ హబ్‌గా అనంతపురం మారబోతోంది. రాయలసీమ 'టెక్నాలజీ హబ్'గా తయారవుతోంది. తిరుపతిలో ఏరో స్పేస్ సిటీ, కర్నూలులో డ్రోన్ సిటీ ఏర్పాటు కాబోతున్నాయి. శ్రీసిటీ.. ఇండస్ట్రియల్ హబ్‌గా తయారైంది. భాస్కర్‌రావు ఒక విజన్ ఇచ్చారు. 2027 మే 13న కిమ్స్ ఆసుపత్రిని ప్రారంభిస్తాం. 2028 ఆగస్టు 15 కంటే ముందే విశాఖలో గూగుల్ తన కార్యకలాపాలు ప్రారంభిస్తుంది. 2028 డిసెంబరులోపు ఫేజ్-1 పూర్తి చేయాలని ఆర్సెల్లార్ మిత్తల్‌కు ఆదేశాలు ఇచ్చాం. ఎలాంటి అనుమతులు కావాలన్నా త్వరగా ఇస్తాం. లక్ష మందికి స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇస్తాం. వైద్యులు కూడా ఏఐని నేర్చుకుంటున్నారు. లక్ష మందికి ఉద్యోగాలు ఇవ్వాలనేదే మా ప్రభుత్వ ఆలోచన. ప్రపంచంలో ప్రతి ముగ్గురు వైద్యుల్లో ఒకరు ఇక్కడి నుంచే ఉండాలి. డిసెంబరు నాటికి భారత్‌లో క్వాంటం కంప్యూటింగ్‌కు చిరునామాగా అమరావతి అవుతుంది.

## అమరావతిలో ఎమ్మెల్యే ఎమ్మెల్సీల టవర్లు సిద్ధం



## వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబు బెయిల్ రద్దు



## నా కుమారుడు తప్పు చేస్తే శిక్ష పడాల్సిందే!



'నిజంగా నా కుమారుడు తప్పు చేస్తే వందశాతం శిక్ష పడాల్సిందే.. చట్టం ముందు అందరూ సమానమే' అని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు.

## అనుమతులు రాగానే అమరావతిలో రీజినల్ పోస్టాఫీస్ వ్యవస్థ



అమరావతిలో రీజినల్ పోస్టాఫీస్ వ్యవస్థ నిర్మాణ అంచనా వ్యయం రూ.50 కోట్ల నుంచి రూ.103 కోట్లకు పెరిగినందున క్యాబినెట్ ఆమోదం

## రజనీకాంత్ స్పీచ్.. మంత్రి లోకేశ్ ఫిదా!

"హిమాలయాల తర్వాత ఈ ఆశ్రమం నాకు ఎంతో నచ్చింది. నిజానికి నేను ఇక్కడ రెండ్రోజులు ఉందామని ప్లాన్ చేశాను.

బెంగుళూరులో జరిగిన 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' కార్యక్రమంలో ప్రముఖ సినీనటుడు రజనీకాంత్ చేసిన ప్రసంగానికి మంత్రి నారా లోకేశ్ ఫిదా అయ్యారు. యువతరం మీ నుంచి చాలా నేర్చుకోవాల్సి ఉందంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు.



**రజనీకాంత్ ఏమన్నారంటే?**

కానీ 15 రోజులు ఉండిపోయాను. ఒక రోజు సాయంత్రం ఆశ్రమంలో భక్తులు వేల సంఖ్యలో ఉన్నారు. అప్పుడు గురుదేవ్ (శ్రీ శ్రీ రవిశంకర్) పిలుపు మేరకు నేను కూడా ఆయనతో కలిసి వేదికపైకి వెళ్లాను.

## హామీ నెరవేర్చిన డిప్యూటీ సీఎం పవన్.,

## గిరిపుత్రుల్లో ఆనందం



అల్లూరి సీతారామరాజు జిల్లా పెదపాడులో పాఠశాల భవనం నిర్మిస్తామని ఇచ్చిన హామీని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నెరవేర్చారు. రూ.17.50 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన పాఠశాల భవనం అందుబాటులోకి వచ్చినట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. గతేడాది ఏప్రిల్ 7న అరకు నియోజకవర్గం పరిధిలోని డుంబ్రిగూడ మండలం, పెదపాడు గ్రామంలో అడవితల్లి బాట కార్యక్రమంలో పవన్ పాల్గొన్నారు. చాపరాయి నుంచి పెదపాడు వరకు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఆ గ్రామంలో మౌలిక వసతులపై ఆరా తీశారు.

## బండి భగీరథ్‌కు లుక్ అవుట్ నోటీసులివ్వాలి



కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌కు పోలీసులు లుక్ అవుట్ నోటీసులు జారీ చేయాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత కోరారు. హైదరాబాద్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటున్న భగీరథ్ విదేశాలకు పారిపోకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు.

## ఇండియానా స్టేట్ అటార్నీగా సాయిశ్రీనివాస్‌రెడ్డి..

## మంత్రి లోకేశ్ అభినందనలు

అమెరికాలోని ఇండియానా స్టేట్ అటార్నీగా ప్రమాణ స్వీకారం చేయడం తెలుగు జాతి గర్వించే విషయమని ప్రశంసించారు. సాయి శ్రీనివాస్ తన మొదటి ప్రయత్నంలోనే ఈ ఘనత సాధించడం గొప్ప విశేషమని శుభాకాంక్షలు తెలిపారు



# తాళ్లూరు లిఫ్ట్ పనులకు 19న
## మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా శంకుస్థాపన

గండేపల్లి మండలం తాళ్లూరు గ్రామంలో దశాబ్దాలుగా రైతుల ఎదురుచూపులకు తెరపడనుంది. తాళ్లూరు పుష్కర ఎత్తిపోతల పథకం పునరుద్ధరణ పనులకు ఈ నెల 19న రాష్ట్ర మానవ వనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా శంకుస్థాపన జరగనుంది. ఈ విషయాన్ని జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ బుధవారం తెలిపారు. శంకుస్థాపనకు సంబంధించిన రూట్ మ్యాప్, ఏర్పాట్లను ఆయన ఇరిగేషన్ ఈ ఈ రాజేశ్వరరావు పెద్దాపురం డి.ఎస్.పి ఏ బి జె తిలక్, సర్కిల్ ఇన్స్పెక్టర్ తిరుపతిరావు అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా తాళ్లూరు లిఫ్ట్ సుమారు ఆరు సంవత్సరాలుగా మూలనపడి రైతులకు తీవ్ర నష్టం కలిగించిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లడం జరిగింది. ఆయన సానుకూలంగా స్పందించి, రెండో ఏడాదిలోనే 52 కోట్ల రూపాయలతో లిఫ్ట్ పునర్ వ్యవస్థీకరణకు కేబినెట్‌లో ఆమోదం తెలిపారని తెలిపారు. నిధులు మంజూరు, టెండర్ ప్రక్రియ పూర్తయ్యాయని, పనులు దక్కించుకున్న మెగా కంపెనీ ప్రతినిధులతో సాంకేతిక అంశాలపై చర్చించి పనులు వేగవంతం చేసేలా ఆదేశాలు ఇచ్చామన్నారు. జూలై 20కల్లా పూర్తి శంకుస్థాపన అనంతరం పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టి, రాబోయే ఖరీఫ్ సీజన్ జూలై 20వ తేదీకల్లా పూర్తి చేసి తాళ్లూరు, చుట్టుపక్కల గ్రామాల రైతుల పొలాలకు నీరందించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వెల్లడించారు. శంకుస్థాపన కార్యక్రమాన్ని



విజయవంతం చేయాలని ఆయన నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పుష్కర ప్రాజెక్టు కమిటీ చైర్మన్ అడబాల భాస్కరరావు, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్ లు పోతుల మోహనరావు, కొత్త కొండబాబు, జీను మణి బాబు, కందుల చిట్టిబాబు, జాస్తి వసంత్, రేఖ బుల్లి రాజు, ఉప్పలపాటి బుల్లెబ్బు, య ర్రంశెట్టి బాబ్జి, బస్వా చినబాబు, ఇరిగేషన్ అధికారులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# అమృతలూరు పి.హెచ్.సి,ని జాతీయ నాణ్యత హామీ ప్రమాణాల బృందం ద్వారా 3 సం.రాలు ఎంపిక

బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గం మండల కేంద్రం అమృతలూరు లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జాతీయ నాణ్యత హామీ ప్రమాణాల బృందం సభ్యులు ఎంపిక చేసినట్లు వైద్యాధికారిణి,పి.శృతి మౌనిక బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన జాతీయ నాణ్యత హామీ ప్రమాణాలు బృందం సభ్యులు ఏప్రిల్ 27,28 తేదీలలో అమృతలూరు పిహెచ్సి ని సందర్శించారన్నారు. జాతీయ నాణ్యత హామీ ప్రమాణాల బృందం వారు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం నాణ్యతముగా ఉన్నది లేనిది, తనిఖీ చేసి నాణ్యతను నిర్ధారిస్తారని తెలిపారు. ఈ టీం సభ్యులు అమృతలూరు పిహెచ్సి లో జరుగు



తున్న బయటి రోగి సేవలను,ఆసుపత్రిలో చేరి పొందుతున్న రోగులకు అందుతున్న సేవలను,కాన్పుల సేవలను,మందుల విభాగమును, జాతీయ ఆరోగ్య కార్యక్రమములను,సాధారణ పరిపాలన విధానమును మరియు లేబోరేటరీ యొక్క పనితీరును నిశితంగా పరిశీలించిన అనంతరం జాతీయ నాణ్యత హామీ ప్రమాణాలు ధ్రువీకరిస్తూ అమృతలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మూడు సంవత్సరములకు సర్టిఫికెట్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. అమృతలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని గ్రామాల ప్రజల సహకారంతో అమృతలూరు పి.హెచ్.సి,ని సమర్థవంతంగా నడిపిస్తామని ఈ సందర్భంగా వైద్యాధికారిణి వివరించారు. జాతీయ నాణ్యత హామీ ప్రమాణాల సర్టిఫికెట్ మూడు సంవత్సరాలకు రావడానికి సహకరించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ వారికి ఇతర పిహెచ్సి సిబ్బందికి,అమృతలూరు పిహెచ్సి సిబ్బందికి వైద్యాధికారిణి,పి.శృతి మౌనిక ధన్యవాదాలు తెలియజేశారు.

# ఇనగలూరు ఎస్సీ కాలనీలో త్రాగునీటి సమస్య వెంటనే పరిష్కరించాలి

శ్రీ సత్యసాయి జిల్లా, ఓడీసీ మండలం, ఇనగలూరు గ్రామంలోని ఎస్సీ కాలనీ మరియు గ్రామీణ ఉపాధి కూలీలు తీవ్ర త్రాగునీటి సమస్యను ఎదుర్కొంటున్న నేపథ్యంలో, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఓడీసీ ఎంపీడీవో కార్యాలయం ముందు ఖాళీ బిందెలతో నిరసన ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు నాయకత్వం వహించిన ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బి కదిరప్ప మాట్లాడుతూ, శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా మండుతున్న ఎండల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో త్రాగునీటి కొరత తీవ్రంగా ఉందన్నారు. ముఖ్యంగా ఇనగలూరు ఎస్సీ కాలనీలో గత మూడు నెలలుగా త్రాగునీటి సమస్య కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించడంలో విఫలమయ్యారని విమర్శించారు. కాలనీలో ఉన్న రెండు బోర్లు పనిచేయకపోవడంతో మహిళలు,





ఉపాధి కూలీలు దూర ప్రాంతాల్లోని వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుని జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. త్రాగునీరు వంటి ప్రాథమిక అవసరం కూడా అందించలేకపోతున్న అధికారుల నిర్లక్ష్యం తీవ్రమైనదని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో త్రాగునీటి సమస్య పరిష్కారమైందని అధికారులు నివేదికలు ఇస్తున్నప్పటికీ, గ్రామీణ ప్రాంతాల వాస్తవ పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉందన్నారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను జిల్లా యంత్రాంగం స్వయంగా పరిశీలించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఓడీసీ మండల అధికారులు వెంటనే ఇనగలూరు అంబేద్కర్ కాలనీలోని రెండు బోర్లను మరమ్మతు చేసి, కాలనీ ప్రజలకు తగిన త్రాగునీటి సదుపాయం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. డిమాండ్లు అమలు చేయకపోతే జిల్లా వ్యాప్తంగా నిరుపేద కూలీలను సమీకరించి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు భారీ స్థాయిలో ధర్నా నిర్వహిస్తామని సంఘం హెచ్చరించింది. కార్యక్రమంలో పాల్గొన్న వారు ఉపాధి కూలీలు మరియు కాలనీ వాసులు: అంజనప్ప శ్రీరాములు గంగాద్రి రామప్పనరసింహ, గంగులమ్మ, రాజమ్మ, రత్నమ్మ, శ్రీలత, నాగమ్మ, గంగమ్మ, రామప్ప తదితరులు పాల్గొన్నారు.

# సర్వసభ్య సమావేశంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి పై చర్చ

ఈ రోజు మండల ప్రజా పరిషత్,మేడికొండూరు నందు జనరల్ బాడీ మీటింగ్ మధ్యాహ్నం 2.30 నుండి 5.30 గంటల వరకు నిర్వహించట మైంది. ఈ సమావేశం నందు అన్ని శాఖల అధికారులు ,గౌరవ ఎంపిటిసి సభ్యులు అడిగిన వాటికి సమాధానాలు తెలియచేశారు. అన్ని శాఖల రివ్యూ చేయడమైనది. ముఖ్యముగా గ్రామపంచాయతీ ల నందు జరిగే అభివృద్ధి, రోడ్లు,మంచినీరు,రైతుల సమస్యలు,వేసవికాలం నందు ప్రజలు తీసుకోవలసిన చర్యలు గురించి హెల్త్ శాఖ వారు,టెన్త్ క్లాస్ విద్యార్థుల ఉత్తీర్ణత అంశాలు మరియు ఇరిగేషన్ , వెలుగు శాఖ ద్వారా లోన్స్ అంశాలు, విద్యుత్ సమస్యలు ఈ సమావేశములో మండల పరిషత్ అధ్యక్షురాలు శ్రీమతి మన్నవ స్వప్న గారి అధ్యక్షతన చర్చించట మైంది. ఈ సమావేశములో మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీ కె.డేవిడ్ ప్రభాకర్ , ఎంజిఎన్ఆర్ఇజిఎస్ గురించి ఇతర అభివృద్ధి కార్యక్రమాలు గురించి తెలియ చేశారు. తహసిల్దార్ రాఘవరావు రెవిన్యూ సమస్యలు పై మాట్లాడరు. ఈ సమావేశం నందు పంచాయతీ కార్యదర్శులు,గ్రామ ప్రత్యేక అధికారులు,మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీ కేశవరావు ఇతరులు పాల్గొని ఉన్నారు




# దివంగత తెలుగు రైతు మండల అధ్యక్షులు చిట్యాల అప్పారావు

### – కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



గండేపల్లి మండల తెలుగు రైతు అధ్యక్షులుగా సేవలందించిన నీలాద్రి రావుపేటకు చెందిన సీనియర్ టీడీపీ నాయకులు చిట్యాల అప్పారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం విదితమే. ఈ విషయం తెలుసుకున్న తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యులు, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ బుధవారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. దివంగత అప్పారావు కుమారుడు, టీడీపీ నాయకులు చిట్యాల బాబ్జి, కోడలు, మాజీ ఎంపీటీసీ చిట్యాల గీతతో పాటు కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అప్పారావు సేవలు, పార్టీకి ఆయన చేసిన కృషిని ఎమ్మెల్యే ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. పార్టీ ఎల్లప్పుడూ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్, గండేపల్లి మండల టీడీపీ అధ్యక్షులు పోతుల మోహనరావు, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు కందుల చిట్టిబాబు, టీడీపీ నాయకులు దార బల్ల సద్గురు మూర్తి, నక్క కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# హెచ్ పి వి వ్యాక్సిన్ 100% పూర్తి చేయాలి



75తాళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రోహిణి ఆకస్మిక తనిఖీ చేశారు. హెచ్ పి వి వ్యాక్సి న్ 100% పూర్తి చేయాలని సూచించారు. హాస్పటల్ ఓపి వివరాలు లభించే సేవలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ ఆదిత్య హాస్పటల్లో లభించే సేవల గురించి వివరించారు. వాక్సిన్ రూముని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఫార్మసిస్టు ధనలక్ష్మి, సూపర్వైజర్ దిలీప్, శ్రీనివాసరావు, ఏసమ్మ స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు

# జనగణన సర్వే పై అధికారులతో సమీక్ష సమావేశం




జనగణన అంశంపై అన్ని శాఖల అధికారులతో తహసిల్దార్ ధనలక్ష్మి ఎంపీడీవో సాయి లీల సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ప్రతి అధికారి రోజు వారి నలభై కుటుంబాలు తప్పనిసరిగా గణనాంకాల నమోదు చేయాలని వారు కోరారు. జన గణన పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వారి మొబైల్ ఫోన్ లోనే వివరాలను పొందుపరిచి భరోసా కల్పించాలన్నారు. ప్రజలు అధైర్య పడకుండా ప్రభుత్వ అధికారులకు సహకరించి జనగణన విజయవంతం చేయాలని కోరారు.

# కనిగిరి డిపోలో నూతన రిజర్వేషన్ కౌంటర్ ప్రారంభం



కనిగిరి ఆర్‌టిసి డిపోలో ప్రయాణికుల సౌకర్యార్థం నూతన రిజర్వేషన్ కౌంటర్‌ను బుధవారం డిపో మేనేజర్ మహమ్మద్ సయనా బేగం ప్రారంభించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ ప్రయాణికులకు వేగవంతమైన, సౌకర్యవంతమైన టికెట్ బుకింగ్ సేవలు అందించడమే లక్ష్యమని తెలిపారు. ముందస్తు రిజర్వేషన్ ద్వారా ప్రయాణికులు తమ ప్రయాణాలను సులభంగా ప్రణాళిక చేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రత్యేకించి పండుగలు సెలవుదినాలు మరియు రద్దీ సమయాల్లో ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా ఈ కౌంటర్ ఉపయోగపడుతుందని తెలిపారు. ఆన్‌లైన్ రిజర్వేషన్‌తో పాటు కౌంటర్ ద్వారా కూడా టికెట్లు పొందవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిపో సిబ్బంది, ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు.

# అమృతలూరు లో హనుమాన్ జయంతి పురస్కరించుకొని లక్ష మల్లెల పూజ



బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గం మండల కేంద్రం అమృతలూరు గ్రామంలో వేంచేసి దిన దిన ప్రవర్తమానంగా వెలుగొందుచూ,భక్తుల కోర్కెలు ఈడేర్చుచున్న కల్పతరువు, అశ్వితావన దీక్ష కంకణుడైన శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి జయంతి ఉత్సవాలు రెండో రోజు బుధవారం పులిపాక సూర్యప్రకాశరావు వంశీయులు తిరుమల నాథ్,శ్రీధర్ ల ఆధ్వర్యంలో లక్ష మల్లెల పూజ ఘనంగా జరిగింది. ఉదయం 6 గంటలకు ఆలయ అర్చకులు,పరాశరం రత్నమాచార్యులు,వేదాంతం పవన్,మేడూరి సోమశేఖర్, యోగానంద శేఖర్,వేదాంతం జయప్రకాష్ ల పర్యవేక్షణలో 25 మంది అర్చక స్వాములతో పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 6 గంటలకు చెరుకు రసంతో స్నపన,అగ్ని ప్రతిష్టాపన,విశేషార్చనగా లక్ష మల్లెల పూజ,అఖండ కర్పూర హారతి,తీర్థప్రసాద వినియోగములు నిర్వహించారు. గ్రామస్తులు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి ఆలయం చెట్టు ప్రదక్షిణలు చేసి,స్వామివారిని దర్శించుకుని,పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# డ్రైన్స్ శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించిన మున్సిపల్ కమిషనర్



ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహా రెడ్డి గారి ఆదేశాల మేరకు కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు చింతలపాలెం ప్రాంతంలో రూ.8 లక్షల వ్యయంతో కొత్తగా నిర్మించనున్న డ్రైన్స్ శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో కనిగిరి మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ గారితో కలిసి టౌన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షేక్ ఫిరోజ్, తెలుగుయువత అధ్యక్షులు అచ్చులా రవి, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులు దొడ్డ సురేష్ రెడ్డి, వార్డు అధ్యక్షులు మూలే శ్రీను, నాయకులు షేక్ షరీఫ్, పెన్నా వెంకటేశ్వర్లు, షేక్ రహ్మాన్, ముతుకుముళ్ళ రవణ రెడ్డి, మధు బాబు, ఉండేలా శ్రీను, పెన్నా కొండలు ప్రసాద్, బ్రహ్మయ్య, వెన్న శ్రీనివాసులు, అంజి నీలిశెట్టి, నాగ పాతూరు, డానియల్ తదితర వార్డు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన రెండవ రోజు ఏ పి ఈ ఏ పి సెట్ - 2026 ఆన్ లైన్ పరీక్ష



జెఎన్టీయుకె కాకినాడ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్ ఌ ఫార్మశీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపి ఈఏపిసెట్ - 2026 ఆన్లైన్ ప్రవేశ పరీక్ష రెండవ రోజు మే 13వ తేదీ బుధవారం రాష్ట్రవ్యాప్తంగా మరియు హైదరాబాద్ లో ప్రశాంతంగా జరిగినట్లు ఏపి ఈఏపి సెట్ ఛైర్మన్ మరియు ఉపకులపతి ప్రొ.సి ఎస్ ఆర్. కె ప్రసాద్ తెలిపారు. ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి రెండవ రోజు బుధవారం ఉదయం 30,130 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 28,167 మంది పరీక్షకు హాజరయ్యారని, 1963 మంది గైర్హాజరైనట్లు ఏపి ఈఏపిసెట్ కన్వీనర్ ప్రొ. ఎన్. మోహన్ రావు తెలిపారు. మొత్తం 93.48 శాతం మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారన్నారు. అలాగే బుధవారం మధ్యాహ్నం 27,292 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 25,561 మంది పరీక్షకు హాజరయ్యారని, 1,731మంది గైర్హాజరు కాగా మొత్తం 93.66 శాతం మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారన్నారు. మొత్తంగా 57,422 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 53,728 మంది పరీక్షకు హాజరయ్యారని, 3,694 మంది గైర్హాజరు కాగా 93.57 శాతం మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారన్నారు. అలాగే కాకినాడ జిల్లాలో ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి రెండవ రోజు బుధవారం ఉదయం 788 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 751 మంది పరీక్షకు హాజరయ్యారని, 37 మంది గైర్హాజరైనట్లు కన్వీనర్ ప్రొ.ఎన్.మోహన్ రావు తెలిపారు. మొత్తం 95.30 శాతం మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారన్నారు. అలాగే బుధవారం మధ్యాహ్నం 788 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 760 మంది పరీక్షకు హాజరయ్యారని, 28 మంది గైర్హాజరు కాగా మొత్తం 96.45 శాతం మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారన్నారు. మొత్తంగా 1,576 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 1,511 మంది పరీక్షకు హాజరయ్యారని, 65 మంది గైర్హాజరు కాగా 95.88 శాతం మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు కన్వీనర్ ప్రొ.ఎన్.మోహన్ రావు తెలిపారు.

# నారా లోకేష్ యువజన ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు అభినందనీయం-కొమ్ముల కన్నబాబు

**- అడపా జగదీష్ కుమార్ ఆధ్వర్యంలో చెరుకు రసం చలివేంద్రం**

**- ప్రారంభించిన కొమ్ముల కన్నబాబు,మండపాక సుబ్బు**





వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ స్ఫూర్తితో ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద బుధవారం నారా లోకేష్ యువజన ఫౌండేషన్ నియోజకవర్గ అధ్యక్షులు అడపా జగదీష్ కుమార్ ఆధ్వర్యంలో చెరుకు రసం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ప్రజలకు చల్లని చెరుకు రసం అందిస్తూ దాహార్తి తీర్చే ఈ సేవా కార్యక్రమాన్ని రాష్ట్ర ఖాదీ గ్రామీణ పరిశ్రమల బోర్డు వైస్ చైర్మన్ కొమ్ముల కన్నబాబు,ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షులు మండపాక సుబ్బు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజలకు ఉపశమనం కలిగించే విధంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ముఖ్యంగా ఆసుపత్రికి వచ్చే రోగులు,బాటసారులు, ప్రయాణికులకు ఈ చలివేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ వెలుగుల నాని,మాజీ సర్పంచ్ యాళ్ల విశ్వేశ్వరరావు,జిల్లా అధ్యక్షులు బత్తుల సూర్యప్రసాద్,సొసైటీ డైరెక్టర్ మదినే వెంకన్న దొర,టీడీపీ జిల్లా వాణిజ్య విభాగ సభ్యులు పోలిశెట్టి శ్రీనివాస్,ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి గొడే హరీష్,కర్రి వీరబాబు,కాలాడి వెంకటేష్, నవీన్,సంతోష్,శ్రీధర్, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# కొంతంగి అగ్నిబాధితులకు అండగా ముద్రగడ గిరిబాబు

**- బియ్యం,నిత్యావసర సరుకులు,దుస్తులు పంపిణీ**





కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం,శంఖవరం మండలం కొంతంగి గ్రామంలో ఇటీవల చోటుచేసుకున్న అగ్నిప్రమాద బాధిత కుటుంబాలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబు బుధవారం పరామర్శించారు. ప్రమాదంలో తాటాకిళ్లు పూర్తిగా దగ్ధమై సర్వస్వం కోల్పోయిన కుటుంబాల పరిస్థితిని తెలుసుకుని ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు తక్షణ సాయంగా బియ్యం,నిత్యావసర సరుకులు, వంట పాత్రలు,దుప్పట్లు మరియు కుటుంబ సభ్యులకు నూతన దుస్తులను అందజేశారు. బాధితులతో మాట్లాడిన గిరిబాబు,ధైర్యంగా ఉండాలని సూచిస్తూ అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అగ్నిప్రమాదంలో ఇళ్లు కోల్పోయి కుటుంబాలు రోడ్డున పడటం బాధాకరం. ఇలాంటి కష్టకాలంలో బాధితులను ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. మీకు ఎల్లప్పుడూ తోడుగా ఉంటామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి అడపా సోమేశ్,శంఖవరం మండల వైసీపీ అధ్యక్షులు నరాల శ్రీనివాస్,ప్రత్తిపాడు నియోజకవర్గ విద్యార్థి విభాగ అధ్యక్షులు దూడల శివకుమార్,గింజాల కొండబాబు,రత్నాకర్,యువజన విభాగ అధ్యక్షులు సకురు గుర్రాజు,చల్లా గంగా సత్య ప్రసాద్,చొప్పా రాంబాబు తదితర నాయకులు,కార్యకర్తలు మరియు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# పాలచర్ల అనంతలక్ష్మి దివంగతికి సంతాపం తెలిపిన

**- ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, నాగేంద్ర చౌదరి కుటుంబానికి పరామర్శ**



జగ్గంపేట గ్రామానికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక, సామాజిక సేవా తత్పరురాలు, అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు పాలచర్ల నాగేంద్ర చౌదరి మాతృమూర్తి అనంతలక్ష్మి మే 6, 2026 బుధవారం ఉదయం శివైక్యం చెందారు. జగ్గంపేటలోనిపాలచర్ల నివాసానికి వెళ్లి స్థానిక ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యులు, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ పాలచర్ల వారి నివాసానికి చేరుకొని అనంతలక్ష్మి గారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళు లర్పించారు. అనంతరం నాగేంద్ర చౌదరి ని ఆయన భార్య భారతిని ఆయన తండ్రి చౌదరిని కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పాలచర్ల అనంతలక్ష్మి సేవలను స్మరించుకుంటూ, ఆమె మృతి పాలచర్ల కుటుంబానికి తీరని లోటని వారి పవిత్ర ఆత్మకు భగవంతుడు శాంతి చేకూర్చాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, పాండ్రంగి రాంబాబు, దేవరపల్లి మూర్తి, దాపర్తి సీతారామయ్య, పిలా మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# వరుస ఫ్లాపులతో ముందు జాగ్రత్త

## రెమ్యూనరేషన్ భారీగా తగ్గించుకున్న రవితేజ

మాస్ మహారాజా రవితేజ గత కొంతకాలంగా బాక్సాఫీస్ వద్ద సరైన విజయాన్ని అందుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకప్పుడు వరుస హిట్లతో టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక మార్కెట్‌ను సృష్టించుకున్న రవితేజ, ఇప్పుడు వరుస పరాజయాలతో కెరీర్‌లో వైఫల్య దశను ఎదుర్కొంటున్నారు. ఇటీవల విడుదలైన సినిమాలు ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో ఆకట్టుకోకపోవడంతో, ఆయన తన తదుపరి ప్రాజెక్టుల విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇప్పటివరకు కమర్షియల్ ఎంటర్‌టైనర్స్‌తో ప్రేక్షకులను అలరించిన రవితేజ, ఇప్పుడు మార్కెట్ పరిస్థితులను బట్టి తన నిర్ణయాల్లో మార్పులు చేస్తున్నారని తెలుస్తోంది. ముఖ్యంగా రెమ్యూనరేషన్ విషయంలో ఆయన తీసుకున్న తాజా నిర్ణయం చిత్రసీమలో హాట్ టాపిక్‌గా మారింది. ఒకప్పుడు సినిమా కోసం రూ.25 కోట్ల వరకు పారితోషికం తీసుకున్న రవితేజ,




ప్రస్తుతం తన రెమ్యూనరేషన్‌ను రూ.15 కోట్లకు తగ్గించుకున్నారని ప్రచారం. నిర్మాతలపై అదనపు భారం పడకుండా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నారని టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. వరుస డిజాస్టర్ల తర్వాత మార్కెట్‌లో తన స్థాయిని మళ్లీ నిలబెట్టుకోవాలంటే ముందుగా మంచి విజయాన్ని అందుకోవాల్సిన అవసరం ఉందని రవితేజ భావిస్తున్నారట. అందుకే ప్రస్తుతం కథల ఎంపికలో కూడా ఆయన చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ప్రస్తుతం రవితేజ నటిస్తున్న తాజా చిత్రం 'ఇరుముడి' పై ఇండస్ట్రీలో మంచి ఆసక్తి నెలకొంది. దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న ఈ సినిమా రవితేజ కెరీర్‌లో పూర్తిగా భిన్నమైన ప్రయత్నంగా చెబుతున్నారు. ఇప్పటివరకు ఎక్కువగా మాస్, కామెడీ, యాక్షన్ ఎంటర్‌టైనర్స్ చేసిన రవితేజ, ఈసారి థ్రిల్లర్ జానర్‌ను ఎంచుకోవడం అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. 'ఇరుముడి' సినిమా కథ, ట్రీట్‌మెంట్, రవితేజ పాత్ర పూర్తిగా కొత్తగా ఉండబోతున్నాయని సమాచారం. ఈ సినిమా విజయమే ఇప్పుడు ఆయన కెరీర్‌కు చాలా కీలకంగా మారింది. ఒకవేళ ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధిస్తే రవితేజ మళ్లీ ఫామ్‌లోకి రావడం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు.. ప్రముఖ సింగర్‌కు జైలు శిక్ష

ప్రముఖ పాప్ సింగర్ బ్రిట్నీ స్పియర్స్ డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నేరాన్ని అంగీకరించారు. దక్షిణ కాలిఫోర్నియాలో మార్చిలో ఆమెపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదైన విషయం తెలిసిందే. దీనిపై సోమవారం విచారణ జరగ్గా.. ఆమె నేరాన్ని అంగీకరించారు. దీంతో ఆమెకు వెంచురా కౌంటీ సుపీరియర్ కోర్టు ఒకరోజు జైలు శిక్షతో పాటు కొన్ని నిబంధనలు విధించింది. శిక్షతో పాటు ఆమె భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం చేయకుండా ఉండటానికి కోర్టు పలు కీలక ఆదేశాలు జారీ చేసింది. మూడు నెలల పాటు ప్రభుత్వం నిర్వహించే డ్రంక్ అండ్ డ్రైవ్ అవగాహన కార్యక్రమంలో పాల్గొనాలని ఆదేశించింది. ప్రతి వారం థెరపీ సెషన్లకు హాజరుకావాలని, నెలకు రెండుసార్లు తప్పనిసరిగా సైకియాట్రిస్ట్‌ను కలవాలని సూచించింది.



## విడాకుల జాబితాలో మరో నటి

### భర్తను అన్ ఫాలో చేసిన మౌనీరాయ్

నటి మౌనీరాయ్ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఒక వార్త కొన్ని రోజులుగా నెట్టింట వైరల్ అవుతోంది. భర్త సూరజ్ నంబియార్‌తో ఆమె విడిపోతున్నట్లు నెట్టింట ప్రచారం జరుగుతోంది. తాజాగా ఈ వార్తలకు బలం చేకూర్చేలా ఇన్‌స్టాగ్రామ్‌లో వీరిద్దరూ ఒకరికొకరు అన్‌ఫాలో చేసుకున్నారు. ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే మౌనీ రాయ్ తనకు సంబంధించిన విషయాలను పంచుకుంటూ టూర్స్ ఫొటోలను షేర్ చేస్తుంటారు. కొన్ని రోజులుగా భర్తతో ఉన్న ఫొటోలు పోస్ట్ చేయలేదు. మరోవైపు సూరజ్ నంబియార్ ఇన్‌స్టాలో పెళ్లి ఫొటోలు కూడా కనిపించడం లేదు. అలాగే రూమర్స్‌ను ఇద్దరూ ఖండించకపోవడంతో ఈ



అంశం చర్చనీయాంశంగా మారింది. 2022 జనవరిలో తన ప్రియుడు సూరజ్ నంబియార్‌ను మౌనీరాయ్ గోవాలో వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. సినిమాల విషయానికొస్తే.. మౌనీరాయ్ 'విశ్వంభర'లో ఓ స్పెషల్ సాంగ్ చేసినట్లు సమాచారం. చిరంజీవి హీరోగా వశిష్ఠ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది. చిరంజీవి సూపర్ హిట్ సినిమా 'ఖైదీ'లోని రగులుతోంది మొగలిపొద.. పాట రీమేక్‌కు మౌనీరాయ్‌తో కలిసి చిరు మరోసారి మెస్మరైజ్ చేయనున్నట్లు తెలుస్తోంది.



## ప్రియాంకకు గ్లోబల్ వాన్‌గార్డ్ గౌరవం

ఈ మధ్య ఎప్పటికప్పుడు అంతర్జాతీయ వేడుకల్లో ప్రెజెంటర్‌గా రెడ్‌కార్పెట్‌పై హొయలొలికిస్తూ కనిపిస్తున్నారు బాలీవుడ్ అందాల తార ప్రియాంక చోప్రా. ఇప్పుడదే ప్రపంచ వేదికపై ప్రతిష్ఠాత్మకంగా భావించే గ్లోబల్ వాన్‌గార్డ్ ఆనర్ పురస్కారాన్ని ఆమె అందుకున్నారు. ఈ విషయాన్ని ప్రియాంక ఇన్‌స్టా వేదికగా పంచుకున్నారు. "ఈ గౌరవంతో పాటు ఇక్కడ ఉన్న సమూహంలో నేను భాగమయ్యాననే అనుభూతిని కలిగించినందుకు గోల్డెన్ హౌస్ వారికి ధన్యవాదాలు. ఇప్పటి వరకు నా ప్రయాణంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞురాలిని"అనే క్యాప్షన్‌ని పేర్కొన్నారు. ఇటీవల లాస్ ఏంజెలెస్‌లోని మ్యూజిక్ సెంటర్‌లో జరిగిన గోల్డ్ హౌస్ అయిదవ ఎడిషన్ గోల్డ్ గాలాకు ఆమె హాజరయ్యారు. ఆసియా పసిఫిక్‌తో పాటు పాశ్చాత్య వినోద రంగంలో సంస్కృతులను అనుసంధానించడంలో గణనీయమైన కృషి చేసినందుకుగానూ.. ప్రియాంక 25 ఏళ్ల కెరీర్‌ని గుర్తిస్తూ ఈ పురస్కారం ఆమెను వరించింది. ప్రపంచవ్యాప్తంగా ఆసియా పసిఫిక్ ప్రాంతానికి చెందిన సంస్కృతి, వినోదంతో కూడిన పలు రంగాలలో అత్యంత ప్రభావవంతులైన వంద మందిని సత్కరించే వేడుక గోల్డ్ గాలా. ఈ ఏడాది 'ఏ న్యూ గోల్డ్ వరల్డ్' అనే థీమ్‌తో జరిగింది. ఇటీవలే 'సిటాడెల్ 2'లో కనిపించారు ప్రియాంక. ప్రస్తుతం దర్శకుడు రాజమౌళి తెరకెక్కిస్తున్న 'వారణాసి' చిత్రంతో బిజీగా ఉన్నారు.

## కమల్–రజనీ మూవీలో త్రిష



తమిళనాడులో ఎన్నికల సందడి మొదలు... గత కొన్ని రోజులుగా త్రిష పేరు మార్మోగిపోతోంది. ముఖ్యమంత్రిగా తమిళ సూపర్‌స్టార్ విజయ్ ప్రమాణ స్వీకారోత్సవంలోనూ త్రిష ప్రధాన ఆకర్షణగా నిలిచారు. తమిళనాడు రాజకీయాల్లోకి ఆమె కూడా ప్రవేశిస్తారన్న ప్రచారం సామాజిక మాధ్యమాల్లో మొదలైంది. అయితే ఆమె వరుస సినిమాలతో సందడి చేయబోతోంది. మరోవైపు కొత్త ప్రాజెక్టుల విషయంలోనూ ఆమె పేరు బలంగా వినిపిస్తోంది. రజనీకాంత్, కమల్‌హాసన్ కలిసి చేయనున్న సినిమాలోనూ త్రిష కథానాయికగా నటించనున్నట్టు సమాచారం. నాలుగున్నర దశాబ్దాల తర్వాత రజనీకాంత్, కమల్‌హాసన్ కలిసి ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆ సినిమాలోనే త్రిష ఓ కథానాయికగా నటించనున్నట్టు తెలుస్తోంది. అదే నిజమైతే ఈ కలయిక మరింత ప్రత్యేకం కానుంది. దీనిపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన అనంతరం ఇన్‌స్టాలో ఓ పోస్ట్‌ని పంచుకున్నారు త్రిష. ప్రేమ ఎప్పుడూ గట్టిగానే వినిపిస్తుంది... అనే వ్యాఖ్యని జోడిస్తూ, తన ముస్తాబు వెనకున్న తన బృందానికి కృతజ్ఞతలు చెప్పింది.

## శ్రీనివాస మంగాపురం సెకండ్ సింగిల్ ప్రోమో

మంగళవారం సినిమా హిట్ తరువాత అజయ్ భూపతి దర్శకత్వం వహిస్తోన్న చిత్రాల్లో శ్రీనివాస మంగాపురం ఒకటి. ఘట్టమనేని వారసుడు జయకృష్ణ హీరోగా పరిచయమవుతోన్న ఈ చిత్రంలో బాలీవుడ్ భామ రవీనా టాండన్ కుమార్తె రషా తడానీ హీరోయిన్ గా నటిస్తోంది. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, సాంగ్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సినిమాను వైజయంతీ మూవీస్ బ్యానర్ పై అశ్వినీదత్ సమర్పించడం మరింత బజ్ ని క్రియేట్ చేసింది. తాజాగా శ్రీనివాస మంగాపురం నుంచి సెకండ్ సింగిల్ ప్రోమోను మేకర్స్ రిలీజ్ చేశారు. మంగా మంగా అంటూ సాగే ఈ సాంగ్ ఆద్యంతం ఆకట్టు కొంటుంది. తిరుపతిలో జరిగే ప్రేమకథగా శ్రీనివాస మంగాపురం తెరకెక్కుతోంది. కొత్తగా తిరుపతి కొచ్చిన కుర్రోళ్ళని బతకనివ్వరా..? అన్నదమ్ములు లేరా మీకు? అంటూ హీరో.. హీరోయిన్ అందాన్ని చూసి మైమరచిపోయి.. ఆమెపై ఉన్న ప్రేమ భావాలను తెలిపుతున్నట్లు లిరిక్స్ వింటుంటే అర్ధమవుతోంది.జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించిన ఈ సాంగ్ కి కాసర్ల శ్యామ్ లిరిక్స్ అందించాడు. ఇక రేవంత్ తన వాయిస్ తో ఈ సాంగ్ ని నెక్స్ట్ లెవెల్ కి తీసుకెళ్లాడు. జయకృష్ణ క్యూట్ స్టెప్స్, మాస్ లుక్, రషా అందం, విజువల్స్ అదిరిపోయాయి. మే 13 న ఫుల్ సాంగ్ ను రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. ప్రస్తుతం షూటింగ్ జరుపుకొంటున్న ఈ చిత్రం త్వరలోనే రిలీజ్ కి సిద్ధమవుతోంది.




***THIRPU VAYIDHA Publisher, Editor and Owned by Maddineni Nageswara Rao,*** SVN Colony, Guntur, Andhra Pradesh - 522006. PRGI Reg No - APTEL/25/A1201 .. Cell No - 7386045673 ..... Printed At SUNDAY PRINTING PRESS, SVN Colony, Guntur, Andhra Pradesh - 522006 ..Cell No - 7386045673.